# సీఎం, ముగ్గురు మంత్రుల దిష్టిబొమ్మ దహనం

## బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించడంపై పీడీఎస్‌యూ ఆగ్రహం



ఖమ్మం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి, ముగ్గురు మంత్రుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మం అర్బన్, మార్చి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని కేయూ పీజీ కళాశాల ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో 15 శాతం నిధులు ఇస్తామని ప్రకటించి.. బడ్జెట్‌లో కేవలం 7.57 శాతం మాత్రమే కేటాయించి నిరాశపరిచిందన్నారు. విద్యారంగం పట్ల తమకు వ్యతిరేక వైఖరి ఉంటుందనే సంకేతాలు ప్రభుత్వం ఇచ్చినట్లు బడ్జెట్ ఉన్నదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా విద్యారంగానికి ప్రత్యేకంగా కేటాయింపులు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వినయ్, భరత్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గనులను ప్రైవేటీకరించొద్దు..

## రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ఏఐటీయూసీ



కొత్తగూడెం హెడ్డాఫీస్ ఎదుట దీక్షల్లో కూర్చున్న ఏఐటీయూసీ నాయకులు

కొత్తగూడెం సింగరేణి, మార్చి 20 : సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం హెడ్డాఫీస్ ఎదుట గురువారం ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షల్లో కూర్చున్న వారికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పూలమాలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కొత్తగూడెం రీజియన్ పరిధిలోని వీకే 7 ఓసీ, సత్తుపల్లి ఓసీలలో బొగ్గు తీసే పనిని కాంట్రాక్టుకు ఇవ్వడం సరికాదన్నారు. బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. కార్యక్రమంలో వంగా వెంకట్, మల్లికార్జున్, వీరస్వామి, మల్లికార్జున్‌రావు, రమణమూర్తి, గట్టయ్య, క్రిష్టోఫర్ పాల్గొన్నారు.

- జిల్లాలో 3 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో పరీక్షా కేంద్రాలు
- బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆటోలు ఎక్కాల్సిందే..
- ఉచిత బస్సు సౌకర్యంపై ప్రకటన చేయని ప్రభుత్వం
- 73 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 12,282 మంది విద్యార్థులు

# పది పరీక్షే..!

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి విద్యార్థులు ఏడాదిపాటు గురువులు చెప్పే పాఠాలు వింటూ.. వాటిని శ్రద్ధగా చదవడం ఒక ఎత్తయితే.. పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాయడం మరో ఎత్తవుతున్నది. తాము చదువుతున్న పాఠశాల నుంచి పరీక్షా కేంద్రాలు 3 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాల్సిన విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పరీక్షా కేంద్రానికి వెళ్లడానికి ఆటోలు, టాటా మ్యాజిక్‌లను ఆశ్రయించాల్సి రావడంతో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల కోసం 73 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 12,282 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. హాల్‌టికెట్ తీసుకున్న విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాన్ని చూసుకుని అంత దూరం ఎలా చేరుకోవాలని అయోమయానికి గురవుతున్నారు. చేసేది లేక తల్లిదండ్రులు ముందస్తుగా ఆటోలను మాట్లాడుకున్నారు. అయితే దూర ప్రాంతాల్లో పరీక్ష రాసే విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామనే ప్రభుత్వ ప్రకటన కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

### వ్యయప్రయాసలతో కూడుకున్న పని..

జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి పదో తరగతి విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలతో కూడుకున్న పనే. ఇలాంటి గ్రామాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో రవాణా సౌకర్యాలపై అధికారులు దృష్టి కేంద్రీకరించకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పేలా లేవు. గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నా.. అవి కొన్ని మారుమూల గ్రామాలకు నడవని పరిస్థితి నెలకొంది.



టేకులపల్లి మండలం బోడు గ్రామంలో పదో తరగతి పరీక్షా కేంద్రం

### టెన్త్ పరీక్షలు జీవితానికి మైలురాయి: భద్రాద్రి కలెక్టర్



కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 20 : పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికీ మైలురాయిగా నిలుస్తాయని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. జిల్లాలో టెన్త్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులందరికీ గురువారం ఆయన ఒక ప్రకటనలో ఆల్ ది బెస్ట్ చెప్పారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. అయితే, విద్యాగమనంలో ఎంతో కీలకమైన ఈ మైలురాయిని అధిగమించడానికి విద్యార్థులు దృఢంగా నిలబడాలని సూచించారు. దీనిపైనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని సూచించారు. నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలోకెల్లా జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.

### 'పది' పరీక్షలు భవిష్యత్తుకు పునాది: ఐటీడీఏ పీవో



భద్రాచలం, మార్చి 20 : విద్యార్థుల ఉజ్వల జీవితానికి పదో తరగతి పరీక్షలే పునాదిగా నిలుస్తాయని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ పేర్కొన్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు గురువారం ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమైన వార్షిక పరీక్షల సమయంలో ఆందోళన చెందకూడదని సూచించారు. ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే 'ఏ' గ్రేడ్ సాధించవచ్చునని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు పరీక్షలు మంచిగా రాస్తే మెరుగైన భవిష్యత్ ఉంటుందని అన్నారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి భద్రాచలం ఐటీడీఏకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

- టేకులపల్లి మండలం బోడు గ్రామంలోని పరీక్షా కేంద్రానికి పదో విద్యార్థులు వెళ్లాలంటే గంగారం నుంచి ఆటోలో వెళ్లాలి. దాదాపు 10 కిలోమీటర్ల దూరం ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు.
- దుమ్ముగూడెం మండలం నర్సాపురం పరీక్షా కేంద్రానికి పర్ణశాల 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆ సమయానికి బస్సు రాకపోతే ఆటోలో వెళ్లాల్సిందే. కొత్తపల్లి గ్రామంలో కూడా కొన్ని గ్రామాలకు విద్యార్థులు దూరంగానే ఉన్నారు.
- ఆళ్లపల్లి మండల కేంద్రంలో పరీక్షా కేంద్రం ఉంది. కానీ.. మర్కోడు విద్యార్థులు 10 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లాలి. అక్కడికి బస్సు రూటులేదు. తప్పని పరిస్థితుల్లో ఆటోలు ఎక్కి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
- లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లలో పరీక్షా కేంద్రం ఉంది. మైలారం నుంచి విద్యార్థులు రేగళ్ల రావాలంటే 15 కిలోమీటర్ల దూరం రావాల్సిందే. బస్సు రూటు ఉన్నా విద్యార్థులు ఆటో ఎక్కాల్సిందే.
- పాల్వంచ మండలం ఉల్వనూరు విద్యార్థులు కిన్నెరసాని వచ్చి పరీక్ష రాయాలి. దాదాపు 10 కిలోమీటర్ల పైనే దూరం ఉంటుంది.
- ఇల్లెందు మండలం కొమరారం విద్యార్థులు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రొంపేడు పాఠశాలకు వెళ్లి పరీక్ష రాయాలి.

### ఆటోలు ఎక్కాల్సిందే..

జిల్లాలోని అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సులు నడవని పరిస్థితి. దీంతో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలంటే విద్యార్థులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నది. మర్కోడు, గంగారం, అనంతోగు, కుంటల్ల గ్రామాలకు టాటా మ్యాజిక్‌లు తప్ప వేరే సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. సమయానికి బస్సులు ఉన్న చోట ఆ బస్సు మిస్ కావడం లేదా ఆలస్యంగా వస్తే పరిస్థితి ఏమిటని దిగులు చెందుతున్నారు.

### మాకు బస్సు సౌకర్యం లేదు..



మా ఊరి నుంచి బస్సు సౌకర్యం లేకపోడంతో పరీక్ష రాయడానికి ఆటోలో వెళతాం. ముందు రోజే పరీక్షా కేంద్రం వరకు ఆటో మాట్లాడుకున్నాం. సెంటర్‌కు వెళ్లాలంటే భయంగానే ఉంది. ప్రమాదాలు చెప్పి జరగవు కదా. ఆటోకు ఏదన్నా ప్రమాదం జరిగితే వేరే ఆటో కోసం ఎదురు చూడాల్సిందే. ఇక్కడి విద్యార్థులందరికీ ఇదే సమస్య. అధికారులే రవాణా సదుపాయం కల్పిస్తే బాగుంటుంది. మాకు టెన్షన్ ఉండదు.

**–మహ్మద్ అస్లాం, పదో తరగతి విద్యార్థి, మర్కోడు, ఆళ్లపల్లి మండలం**

### ఆటో ఎక్కి వెళ్లాల్సిందే..



ఒకవైపు పరీక్షలంటే కొంచెం భయంగానే ఉంది. మరోవైపు ఆటోలో వెళ్లాలంటే ఏం జరుగుతుందోననే ఆందోళన. కేంద్రానికి వెళ్లిన తర్వాత నెంబర్లు చూసుకోవాలి. అదే కేంద్రం దగ్గరగా ఉంటే ఎలాంటి భయం ఉండదు. ఊర్లో స్కూల్ ఉన్నా సెంటర్ లేకపోవడం వల్ల బయటకు వెళ్లి పరీక్ష రాయాల్సి వస్తుంది. మా పక్కన గంగారం విద్యార్థులకు కనీసం ఆటోలు కూడా ఉండవు. ముందే మాట్లాడుకోవాలి.

**–బుగ్గ సాహితీ వర్మ, పదో తరగతి విద్యార్థి, కుంటల్ల, టేకులపల్లి మండలం**

### పకడ్బందీ ఏర్పాట్లు చేశాం..



పరీక్షా కేంద్రాలు కొన్ని గ్రామాలకు దూరంగా ఉన్న మాట వాస్తవమే. కానీ.. అన్ని గ్రామాలకు బస్సుల ద్వారా వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులతో మాట్లాడాం. బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష ఉంటుంది. పరీక్షల నిర్వహణ, స్క్వాడ్ బృందం ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తారు. అన్ని కేంద్రాల వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాం.

**–వెంకటేశ్వరాచారి, భద్రాద్రి డీఈవో**

- రెండు ఎన్‌కౌంటర్లు.. 30 మంది మావోయిస్టులు మృతి
- ఛత్తీస్‌గఢ్ ఎదురుకాల్పుల్లో ఒక డీఆర్‌జీ జవాన్ మృతి
- 'ఎక్స్' వేదికగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా సంచలన వ్యాఖ్యలు

# దండకారణ్యం రక్తసిక్తం



దండకారణ్యం నుంచి మావోయిస్టుల మృతదేహాలను తరలిస్తున్న జవాన్లు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 20 : తుపాకుల మోతతో దండకారణ్యం రక్తసిక్తమైంది. భీకర పోరులో ఎటు చూసినా యుద్ధ వాతావరణం నెలకొంది. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన రెండు వేర్వేరు ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు, ఒక జవాన్ మృతిచెందాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ రేంజ్ పరిధి బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు పెద్ద ఎత్తున సమావేశమవుతున్నట్లు పోలీస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్), సీఆర్‌పీఎఫ్ భద్రతా దళాలు సంయుక్తంగా పీడియా అడవుల్లో బుధవారం రాత్రి సెర్చింగ్ ఆపరేషన్ మొదలు పెట్టాయి. ఈ క్రమంలో ఉదయం 6:30 గంటల సమయంలో జవాన్లకు మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే తేరుకున్న జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించగా.. ఇరు వర్గాల మధ్య సుమారు నాలుగు గంటలపాటు భీకర పోరు సాగింది. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో గాయపడిన ఒక డీఆర్‌జీ జవాన్ పరిస్థితి విషమించి మృతిచెందాడు. జవాన్లు తమ వేగాన్ని పెంచుతూ ముందుకెళ్లడంతో వారి ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు.

కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్‌లో భారీ ఎత్తున మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి 26 మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆటోమెటిక్, సెమీ ఆటోమెటిక్ వంటి తదితర ఆయుధ, వస్తు సామగ్రిని భారీ ఎత్తున జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరికొందరు మావోయిస్టులు తీవ్రంగా గాయపడినట్లు పోలీస్ అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. కాంకేర్–నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దు చోటేబేథియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోరోస్‌కోడో గ్రామ సమీప అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ పాటిలింగం వెల్లడించారు. ఏకకాలంలో రెండు జిల్లాల్లో జరిగిన దాడుల్లో మొత్తం 30 మంది మావోయిస్టులు సహా ఓ డీఆర్‌జీ జవాన్ మృతిచెందినట్లు పోలీస్ అధికారులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న ఆపరేషన్ 'కగార్' మావోయిస్టులను తుడిచిపెట్టడమే లక్ష్యంగా దూసుకెళ్తున్నది. కాగా.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా 'ఎక్స్' వేదికగా ఈ ఎన్‌కౌంటర్‌నుద్దేశించి పోస్టు చేశారు. 'మోదీ సర్కార్ మావోయిజాన్ని తుదముట్టించడమే లక్ష్యంగా కఠినమైన చర్యలు తీసుకుంటున్నది. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశం నక్సల్స్ రహితంగా మారుతుంది' అంటూ ఘాటైన పోస్టు చేయడం సంచలనంగా మారింది.

# వచ్చేదే రెండు బిందెలు.. అది కూడా 'చిలుము' నీళ్లు

- 'సాయన్నపేట'లో తీవ్రతరంగా తాగునీటి సమస్య
- రెండు చేతి పంపుల్లో సరిపడా నీళ్లు రాని పరిస్థితి
- గృహావసరాలు, పశువులకు సరిపడక ఇక్కట్లు
- భూగర్భ జలాలు పడిపోవడంతో ఇబ్బందులు
- 'మిషన్ భగీరథ'ను పట్టించుకోని ప్రస్తుత పాలకులు
- వారానికి ఒక్కసారే కొద్దిపాటి నీళ్లు ఇస్తూ నిర్లక్ష్యం

అది ఒక చిన్న గిరిజన గ్రామం. మొత్తం కలిపినా 36 కుటుంబాలే. అందరూ పేదలే. వ్యవసాయం, వ్యవసాయ కూలి పనులే ఆధారం. కనీసం సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదు. అంత చిన్న గ్రామంలో తాగునీటి సమస్య మాత్రం చాలా తీవ్రంగా ఉంది. రెండు చేతిపంపులు ఉన్న ఆ గ్రామంలో కనీసం ఒక్కోదాంట్లో రెండు బిందెల చొప్పున కూడా రాని పరిస్థితి. గృహావసరాలకే దినదినగండం లాంటి దయనీయ స్థితి. ఇక పశువుల దప్పిక తీర్చేందుకు తల్లడిల్లాల్సిన దారుణమైన స్థితి. దాహార్తి తీర్చుకోవాలన్నా చిలుము పట్టిన నీళ్లనే తాగాల్సిన దుస్థితి. ఇదీ.. టేకులపల్లి మండలం తొమ్మిదోమైలుతండా పంచాయతీలోని సాయన్నపేట గ్రామం తాగునీటి కటకట పరిస్థితి.

– ఇల్లెందు, మార్చి 20



రెండు బిందెలు మాత్రమే వచ్చే చేతిపంపు వద్ద నిలిచి ఉన్న మహిళలు

36 కుటుంబాల ప్రజలు జీవిస్తున్న సాయన్నపేటలో వేసవి ప్రారంభంలో తాగునీటి సమస్య తీవ్రతరంగా ఉంది. రెండు చేతిపంపులు మాత్రమే ఉన్న ఆ గ్రామంలో గృహావసరాలకు, పశువులకు మంచినీళ్లు అందని పరిస్థితి ఏర్పడింది. భూగర్భ జలాలు అడుగంటడంతో ఆ రెండు చేతిపంపుల నుంచి రెండేసి బిందెలకంటే ఎక్కువ నీళ్లు రావడం లేదు. దీంతో ఇంట్లో వినియోగానికే ఆ నీళ్లు సరిపోవడం లేదు. దీంతో పశువులకు గొంతెండాల్సిన పరిస్థితి. అయితే, రెండు బిందెల చొప్పున వచ్చే ఆ నీళ్లు కూడా మొత్తం చిలుముతో నిండి ఉంటున్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 'మిషన్ భగీరథ'పై నిర్లక్ష్యం..

టేకులపల్లి మండల కేంద్రానికి సమీపానే ఉన్న ఈ గిరిజన గ్రామంలో అన్నీ సమస్యలే ఉన్నాయి. దానికి అతి సమీపంలోని తొమ్మిదోమైలు తండాలో మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా దాని నుంచి క్రమంగా తప్పకుండా నీళ్లు అందించడం లేదు. వారికి ఒకసారి మాత్రమే సాయన్నపేటకు నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ఆ గ్రామంలో తాగునీటి కటకట ఏర్పడింది.

### రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయి..



మా గ్రామంలో ఉన్న చేతి పంపుల్లో ప్రస్తుతం రెండు బిందెల నీళ్లే వస్తున్నాయి. ఆ తర్వాత కొద్దిపాటి నీళ్లు వచ్చినా అవి పూర్తిగా చిలుము పట్టి ఉంటున్నాయి. ఈ చేతిపంపులను చాలా ఏళ్ల క్రితం వేసిన కారణంగా వాటి నుంచి వచ్చే నీళ్లు మురికిగా ఉంటున్నాయి. పశువులకు నీళ్లు అందించాలన్నా కష్టంగా ఉంటోంది. **–దనసరి లక్ష్మి, సాయన్నపేట**

### బోరు వేయించుకునే స్థోమత లేదు..



మా గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. అలాగని రూ.వేలకు వేలు ఖర్చు పెట్టి బోరు వేయించుకునే స్థోమత కూడా మాకు లేదు. అయితే, ఈ నీళ్ల బాధలు భరించలేక మా గ్రామంలోని కొందరు అప్పులు చేసి మరీ బోర్లు వేయించుకున్నారు. కానీ అవి వాళ్ల ఇంటి అవసరాల మేరకే వినియోగించుకుంటున్నారు.

**–తోల్లెం మల్లమ్మ, సాయన్నపేట**

# ముగిసిన ఇంటర్ పరీక్షలు

## ఇంటిబాట పట్టిన హాస్టల్ విద్యార్థులు



ఇంటర్మీడియట్ పరీక్షలు ముగియడంతో ఇంటికి బయలు దేరిన విద్యార్థులు

ఖమ్మం అర్బన్, మార్చి 20 : జిల్లాలో 16 రోజులపాటు కొనసాగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఏడాదిపాటు అధ్యాపకులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటూ పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు వార్షిక పరీక్షలు ముగియడంతో కేరింతలు కొడుతూ సందడి చేశారు. చివరి రోజు పరీక్ష రాసి కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. ఇన్నాళ్లు తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ హాస్టళ్లు, ప్రత్యేక గదుల్లో ఉంటూ చదువుకున్న విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు ముగియడంతో సామగ్రితో ఇంటిబాట పట్టారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మొత్తం నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. గురువారం జరిగిన పరీక్షల్లో 16,476 మందికి.. 16,033 మంది హాజరుకాగా.. 443 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో పేర్కొన్నారు.













